# ఆహ్లాదం

కొందరి సమక్షంలో యుగాలు సైతం క్షణాల్లా గడిచిపోతాయి ! ఎప్పుడెప్పుడు వాళ్ళ దగ్గరికి రెక్కలు కట్టుకు వెళ్ళి వాల్దామా అన్పిస్తుంది ! వాళ్ళ ఉనికి మనకి ఎంత హుషారునీ, ఉత్తేజాన్నీ, ఉల్లాసాన్నీ కల్గిస్తుందో... వాళ్ళ ఎడబాటు అంత వెలితినీ, నిస్తేజాన్నీ, నిస్సత్తువనీ కల్గిస్తుంది !

మరికొందరుంటారు... వాళ్ళు ఎంత బిజీమనుషులంటే... 'రోజుకి ఇరవై నాలుగ్గంటలు కాక నలభై ఎనిమిది గంటలుంటే బావుణ్ణు' అనుకునే 'పని ఒత్తిడి మనుషులు!' వీళ్ళకి సరదాగా ఉండాలని లోలోపల ఎంతున్నా.... ఉండటానికి టైమ్ దొరకని దురదృష్టవంతులు!

ఇలాంటి వాళ్ళ మనసు....

'నా దగ్గర మంత్రాలేగానీ ఉంటేనా?...ఒకే ఒక గంట నిన్ను నీ రొటీన్ లైఫ్‌లోంచి ఝామ్మంటూ పైకి లేపుకుపోయి... ఏ పూలవనాల్లోనో, నీలిగగనాల్లోనో, ప్రేమ సీమల్లోనో, తిప్పితిప్పి... తెచ్చి మళ్ళీ భూమ్మీద దించేద్దును!....'

అనే మనుషుల కోసం బెంగెట్టుకుంటుంది!

అదే క్షణాన.....

లోకంలో చేయడానికి పనేం లేనట్టు.... తమ సూటి పోటి మాటలతో, వేధింపులతో అస్తమానం ఎవర్నో ఒకర్ని వేపుకుతినే మనుషుల్ని ఈసడించుకుంటుంది !

ఇంకొందరుంటారు.... వీళ్ళు ఎప్పుడూ గొణుగుతూ, సణుగుతూ... తమ బాధలన్నీ ఏకరువు పెడ్తూ... ఎప్పుడు చూసినా మూర్తీభవించిన శోకదేవతల్లా ఉంటారు. ఇలాంటి మనుషుల దగ్గర... కాలం కదలకుండా మొరాయిస్తుంది ! పరిసరాలు ఊపిరాడ నట్టుగా.... మూగబోయినట్టుగా ఉంటే.....

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే మనుషుల దగ్గర కాలం 'మంచు'లా కరిగి పోతుంది... పరిసరాలు పూల సౌరభాల్ని విరజిమ్ముతాయి ! మానసికోల్లాసం కోసం ప్రత్యేకించి... ఏ సైట్ సీయింగ్‌కో వెళ్ళనక్కర్లేదు... ప్రకృతే వాళ్ళ దగ్గరికి కదిలి వస్తుంది! అప్పటిదాకా స్తబ్దుగా ఉన్న పరిసరాలన్నీ ఒక్కసారిగా చైతన్యాన్ని సంతరించుకుంటాయి!

ఎవరి రాకతో మన పరిసరాలు కళకళ లాడి...

ఎవరి నిష్క్రమణతో వెల వెల బోతాయో....

వాళ్ళ సమక్షంలో మన మనసు పురి విప్పిన మయూరంలా నర్తిస్తుంది !

సున్నితమైందీ... సుకుమారమైందీ.... సుమసదృశమైందీ... మనిషి మనసు !

ఆహ్లాదకరమైన వాతావరణంలో దాన్ని అందంగా వికసించనీయాలే తప్ప 'పరుష పు మాటల'తో మొగ్గ దశలోనే వసివాడనీకూడదు!

16-7-1995